ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 3 ఫిబ్రవరి 2024

రాజన్న క్షేత్రంలో
భక్తుల రద్దీ 7

రోడ్డు భద్రతా
నియమాలు పాటించాలి 8

పన్నుల వసూళ్లకు కసరత్తు



- జిల్లా పంచాయతీల్లో చివరి దశకు చేరుకున్న లక్ష్యం
- బకాయిలపై ప్రత్యేక దృష్టి
- జిల్లాలో ఆస్తిపన్ను రూ.5.56 కోట్లు
- జిల్లాలో 86.1 శాతం పూర్తి
- వీర్నపల్లి మండలంలో వంద శాతం పూర్తి
- ప్రత్యేక అధికారులపై తొలి భారం పన్నులే
- జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఈ ఏడాది కూడా పల్లెల్లో ఆస్తి పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని గడువులోపే పూర్తి చేసి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచే దిశగా పంచాయతీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాల సహకారంతో జిల్లాలో ఇప్పటికే 86.1 శాతం పన్నుల వసూలు పూర్తి చేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక అధికారులపై పన్నుల వసూళ్ల భారం పడనుంది. జిల్లాలో రూ.77 లక్షల 28 వేల 51 వసూలు కావాల్సి ఉంది. కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పన్నుల వసూలు పైనే ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.

● జిల్లా పన్నుల వసూలు లక్ష్యం

జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలో వంద శాతం పన్నుల లక్ష్యాన్ని పూర్తి చేయడంపై దృష్టిసారించారు. వరుసగా పన్నుల వసూళ్లలో వంద శాతం పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. జిల్లాలోని 12 మండలాల్లోపని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల్లో రూ.5 కోట్ల 56 లక్షల 7 వేల 513 వసూలు లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో రూ.4 కోట్ల 78 లక్షల 79 వేల 456 వసూలు చేశారు. ఇంకా రూ. 77 లక్షల 28వేల 057 వసూలు చేయాల్సి ఉంది. జిల్లాలో వీర్నపల్లి మండలంలో రూ.11,37,291 పన్నుల లక్ష్యాన్ని పూర్తి చేసి వంద శాతంలో నిలిచారు. బోయినపల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో రూ.31,04,086కి రూ.26,67,165 వసూలు చేశారు. చందుర్తి మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో రూ.36,38,713కి రూ.31,83,493 వసూలు చేశారు. ఇల్లంతకుంట మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో రూ.41,66, 140కిగాను రూ .39,62,652, గంభీరావుపేట మండలంలో 21 గ్రామ పంచా యతీల్లో రూ.64,60,915కి గాను 47,77,260, కోనరావుపేట మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో రూ.40,39,428కిగాను రూ.39,95, 350, ముస్తాబాద్ మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో రూ78,99, 290కిగాను రూ.67,51,067, రుద్రంగి మండలలో పది గ్రామ పంచాయతీల్లో రూ. 22,89,587కిగాను రూ.21,30,706, తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామ పంచాయతీల్లో రూ.66,93,801కిగాను రూ.62,14,652, వేముల వాడ మండలంలో 11 గ్రామ పంచాయతీల్లో రూ.62,18,276కి గాను రూ.52,60,194, వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో రూ.21,23,105కిగాను రూ.17,92, 001, ఎల్లారెడ్డిపేట మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో రూ.78,36, 881కిగాను రూ. 60,07,625 వసూలు చేశారు. మిగిలిన వసూలుకు కసరత్తు చేస్తున్నారు.

వసూలు కావాల్సిన పన్నులు

మండలం	బకాయిలు (రూపాయల్లో)	వసూళ్లు శాతం
గంభీరావుపేట	16,83,655	73.94
ఎల్లారెడ్డిపేట	18,29,256	76.66
వేములవా డరూరల్	3,31,104	84.4
వేములవాడ	9,58,082	84.59
ముస్తాబాద్	11,48,223	85.46
బోయినపల్లి	4,36,921	85.92
చందుర్తి	4,55,220	87.49
తంగళ్లపల్లి	4,79,149	92.84
రుద్రంగి	1,58,881	93.06
ఇల్లంతకుంట	2,03,488	95.12
కోనరావుపేట	44,078	98.91
వీర్నపల్లి	--------	100.00
మొత్తం	77,28,057	86.01

గడువులోపే లక్ష్యం పూర్తి
- రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి



జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాం. గడువులోపే వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు కలెక్టర్ మార్గదర్శనంలో 86.1 శాతం పూర్తి చేశాం. ప్రతీ సంవత్సరం వంద శాతం పన్నులు వసూలు చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాం. మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

మాఘ అమావాస్య జాతర పోస్టర్ ఆవిష్కరణ



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని నాగాయపల్లి దుబ్బ రాజేశ్వరస్వామి ఆలయంలో 8, 9వ తేదీల్లో నిర్వహించనున్న మాఘమావాస్య జాతర పోస్టర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఆవిష్కరించారు. స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. గురువారం సాయంత్రం గ్రామంలో పోచమ్మబోనాలు, శుక్రవారం శివ కల్యాణం, రథోత్సవం వంటి కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బండి కొండయ్య, అచ్చ శంకర్, గుంటి కొమురయ్య, మాసం విష్ణు, బండి రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందించిన డీఈవో



విద్యార్థిని వైశాలిని అభినందిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గొల్లపల్లి వైశాలిని సిరిసిల్ల జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డీఈవో రమేశ్‌కుమార్ శుక్రవారం అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని పేర్కొన్నారు. సెక్టోరల్ అధికారి శైలజ, డీఎస్‌వో దేవయ్య, పాఠశాల హెచ్‌ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతి, ధర్మయ్య దేవయ్య, బలరాం, శ్రీనివాస్, అఫ్జల్, సునంద, పర్శరాం, ప్రనూష, మంజుల పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారాన్ని అందజేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్

సిరిసిల్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న ఇంటర్ విద్యార్థులకు సిరిసిల్ల లయన్స్ క్లబ్ అల్పాహారం అదించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. శుక్రవారం సిరిసిల్లలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నగునూరి శ్రీకాంత్, సభ్యులు మడుపు నవీన్, బుస్స పవన్ విద్యార్థినులకు అల్పాహారాన్ని అందజేశారు. పరీక్షలు ముగిసే వరకు కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజ కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణలో భాగస్వాములు కావాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 2: మత్తు పదార్థాల నివారణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లాలో నెల రోజులుగా మత్తుపదార్థాలు, గంజాయి విక్రయాలపై ఎస్పీ వివరాలు వెల్లడించారు. నెల రోజుల్లో 1.250గ్రాముల గంజాయి విక్రయంపై ఐదు కేసులు నమోదుచేసి 13మందిని రిమాండ్‌కు తరలించామన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు చేస్తున్నామన్నారు.సమాచారం ఉంటే వెంటనే మెసేజ్ యువర్ ఎస్పీ నంబరు 6303922572 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. మత్తు పదార్థాలు ఇతరులకు విక్రయించినా, తీసుకున్నా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

'గోరుముద్ద' ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదో తరగతి పరీక్షలు సమీస్తున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు గోరుముద్ద కోసం స్థానిక పీఎంపీ వైద్యుడు ఆంజనేయులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయకుంటే పోరాటం



అనంతగిరిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 2: అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా సాగునీటిని విడుదల చేయకుంటే రైతుల తరపున పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని అనంతగిరిలో శుక్రవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీ ద్వారా సూర్యపేట, జనుగామ, హుస్నాబాద్ ప్రాంతాలకు నీటిని తీసుకెళ్తున్నారని, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ ఆర్భాటంగా ప్రాజెక్టును పరిశీలించారని, నీటి విడుదలను ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. రాజకీయ బేషజాలకు వెళ్లకుండా రైతులకు అండగా నిలవాలన్నారు. సాగునీరు లేక రైతులు వలస వెళ్లేవారని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీరు అందించడంతో స్వగ్రామాలకు వచ్చారని అన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పాతరోజులు వచ్చేలా ఉన్నాయన్నారు. రైతులపై ప్రేమ ఉంటే ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీటిని విడుదల చేయాలన్నారు. జడ్పీవైస్ ఛైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గొట్టెపర్తి పర్శరాం, పట్నం అశ్విని శ్రీనివాస్, సావనపెల్లి వనజఅనీల్‌కుమార్, పోచమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ బాలగౌడ్, మాజీ ఉపసర్పంచ్ బాలకిషన్, అంజనేయులు, నాయకులు రాజారాం, మీసరగండ్ల అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 2: రైతులను తప్పుదోవ పట్టించేలా బీఆర్‌ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌ను నీటితో నింపడానికి ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని బీఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోయాక రైతులు గుర్తుకు వచ్చారా? అని ప్రశ్నించారు. దాచారం గ్రామ రైతులు సాగునీటి కోసం చేసిన పోరాటాన్ని బీఆర్‌ఎస్ నాయకులు మర్చిపోయినట్లు ఉన్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని దోచుకున్న ప్రభుత్వం నేడు చెప్పే కల్లబొల్లి మాటలను రైతులు నమ్మేపరిస్థితి లేదన్నారు. రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. గత ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉందో ప్రజలందరికీ తెలిసిపోయిందన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమన్నారు. ప్యాక్స్ మాజీ ఛైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటి, జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టి ఆనందరెడ్డి, నాయకులు కర్ణాకర్‌రెడ్డి, మల్లేశం, జమాల్, బాల్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, నరేష్, వెంకటరెడ్డి, రాజేశం, అశోక్ పాల్గొన్నారు.

క్యాంపునకు తరలిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



హైదరాబాద్ సమీపంలోని క్యాంపులో ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

వేములవాడ, ఫిబ్రవరి 2:వేములవాడ పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ ఎన్నికకు గడువు సమీపిస్తుండగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. వైస్ ఛైర్మన్ మధు రాజేందర్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు ఈ నెల 12న ఎన్నిక నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వైస్ ఛైర్మన్ పదవి దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్‌కు చెందిన నాలుగో వార్డు కౌన్సిలర్ మారం కుమార్ కాంగ్రెస్‌కు చెందిన 14వ వార్డు కౌన్సిలర్ ప్రయత్నాలు ప్రారంభించారు. సాంకేతికంగా బీఆర్‌ఎస్‌కు 16 మంది సభ్యుల మద్దతుతోపాటు పలువురు ఇండిపెండెంట్‌లు, ఇద్దరు బీజేపీ సభ్యులు మద్దతిస్తున్నా బీఆర్‌ఎస్‌లోని ఇద్దరు ముగ్గురు సభ్యులు ఎవరికి మద్దతు ఇవ్వాలి అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మారం కుమార్‌కు మద్దతుగా 16 మంది కౌన్సిలర్లు శుక్రవారం హైదరాబాదులోని క్యాంపులో చేరిపోయినట్లు తెలిసింది. వీరితో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు తమకు మద్దతు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని బీఆర్‌ఎస్ క్యాంపులోని ఓ కౌన్సిలర్ తెలిపారు. 28 మంది సభ్యులున్న పాలకవర్గంలో వైస్ ఛైర్మన్ ఎన్నికల కోసం 15 మంది సభ్యుల మద్దతు అవసరం ఉండగా ప్రస్తుతం మారం కుమార్ క్యాంపులో ఉన్న 16 మంది సభ్యులతో కూడిన ఫొటోను విడుదల చేయడంతో వైస్ ఛైర్మన్ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ క్యాంపు ఏ విధంగా వ్యవహరిస్తుందనే అంశం వేచి చూడాల్సి ఉంది.

ఈవీఎంల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా చేపట్టాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్దాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల మొదటి స్థాయి తనిఖీ ఏర్పాట్లపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌తోపాటు సిరిసిల్ల, వేములవాడలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణంలో ఈవీఎం, వీవీప్యాట్ల అవగాహన ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల కోసం కావాల్సిన సామాగ్రిని తెప్పించుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాను మరోసారి పరిశీలించడంతోపాటు డబుల్ ఓట్లు, తప్పులు ఉండకూడదని స్పష్టం చేశారు. బీఎల్‌వోలతో ఇంటింటికి తిరిగి జాబితాను సిద్ధం చేయాలని, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, ముఖ్య ప్రణాళికా అధికారి శ్రీనివాసచారి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 2: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీన జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు పేయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలను నిర్వహించాలని డీఈవో రమేష్‌కుమార్ మండల విద్యాధికారులను ఆదేశించారు. ఈ నెల 5న పాఠశాల స్థాయిలో పోటీలను నిర్వహించి ఒక్కో విభాగంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను ఎంపిక చేయాలని, మండల స్థాయికి పంపించాలని సూచించారు. ఈ నెల 7న మండల స్థాయిలో మండల విద్యాధికారులు, నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించి ప్రతీ మండలంలో ఒక్కో విభాగం నుంచి ప్రథమ స్థానం పొందిన నలుగురు విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయాలన్నారు. 12న ఉదయం 10 గంటలకు వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు, 12 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య 9492258775లో సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు



బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారి బాలచందర్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: పంచాయతీ పాలక వర్గాల పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించింది. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, రాజన్నపేట, సింగారం, బొప్పాపూర్, అల్మాస్‌పూర్, దుమాల, వెంకటాపూర్, పదిర, రాగట్లపల్లి, గుండారం, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులను తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : గ్రామాల్లోని ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ఉమారాణి, నరేష్ కుమార్, ప్రవీణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని 17 గ్రామాల్లో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామాల్లో తాగునీరు, పరిశుభ్రత, శానిటేషన్‌పై ప్రతీరోజు సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఇల్లంతకుంట:మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కోనరావుపేట: గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించింది. కాగా శుక్రవారం ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక అధికారులకు ఒక్కొక్క అధికారికి రెండు నుంచి నాలుగు గ్రామాలు ఇవ్వడం వల్ల పాలనలో ఇబ్బంది ఏర్పడుతుందని అంటున్నారు. అందుకే ప్రభుత్వం స్పందించి ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

రుద్రంగి: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్‌లు బాధ్యతలు చేపట్టారు. రుద్రంగి ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో శంకర్, మానాలకు ఎంపీవో సుధాకర్, గైదిగుట్ట, అడ్డబోరు గ్రామాలకు తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ తండా, రూప్లానాయక్ తండా గ్రామాలకు పీఆర్ ఏఈ మనోహర్, బడితండా, చింతమణితండా గ్రామాలకు డీటీ యాదగిరి, దెగవాత్ తండా, విపణితండా గ్రామాలకు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీ శుక్రవారం ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

చందుర్తి : సర్పంచుల పదవీకాలం ముగియడంతో పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. 19 పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చందుర్తి, రామన్నపేట పి.రవీందర్ (ఎంపీడీవో), తిమ్మాపూర్ ఐ.శాంతయ్య (డీఈ), బండపల్లి, కిష్టంపేట సీహెచ్ శ్రీనివాస్ (తహసీల్దార్), మల్యాల, కట్టలింగంపేట బి.ప్రదీప్ కుమార్ (ఎంపీవో), అనంతపల్లి, మూడపల్లి సీహెచ్ దుర్గరాజు (ఎంఏవో), సనుగుల, దేవుని తండా టి.వెంకటేశ్వర్లు (ఏఈ పీఆర్), కొత్తపేట, లింగంపేట కె.శ్రీనివాస్(డీఈ), నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లి టి.రాజేంద్రప్రసాద్ (డీసీవో ఆర్‌ఎస్), జోగాపూర్, రామారావుపల్లి శ్రీలత (డీటీ), మర్రిగడ్డ, ఎన్గల్ రవిశంకర్ (ఏఈ) బాధ్యతలు చేపట్టారు.



రుద్రంగిలో బాధ్యలు చేపడుతున్న ఎంపీడీవో

వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రికి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్



వేములవాడ ప్రధాన ఆసుపత్రి


వేములవాడ టౌన్, ఫిబ్రవరి 2 : వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ అందింది. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారు. దీంతో కేంద్ర బృందం గత సంవత్సరం అక్టోబర్‌లో వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించింది. ఫార్మసీ, ఓపీడీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ ఆక్సిలరీ సర్వీసెస్, ఐపీడీ, ఓటీ, ల్యాబ్, మెటర్నిటీ వార్డుల్లో అందిస్తున్న సేవలకు ఎన్ క్వాస్ సర్టిఫికేషన్ లేబర్ రూమ్ మెరుగైన నిర్వహణకు లక్ష్య ప్రోగ్రామ్‌లో భాగంగా సర్టిఫికేషన్లు పీడియాట్రిక్ విభాగంలో ఉత్తమ వైద్య సేవలు అందించినందు ముస్కాన్ సర్టిఫికేషన్‌ను వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి కైవసం చేసుకుంది. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి ఎన్‌క్వాస్ గుర్తింపు పొందినందుకు కలెక్టర్ అనురాగ్ జయంతి హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో వైద్య ప్రమాణాలు మెరుగయ్యాయని చెప్పడానికి మరో నిదర్శనమిదేనని, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు నాణ్యమైన, అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకు కృషి చేసిన వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

నలుగురిపై అదనపు కట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: అదనంగా వరకట్నం కోసం వేధించిన సం ఘటనలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన భర్త వంగాల సుమన్, అత్తామామలు సుగుణ, స్వామి, బావ సునీల్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ శుక్రవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన జ్యోతిని సుమన్ 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. కొంత కాలంగా ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు వలస వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకొని కూలీ పనులు చేస్తున్నారని తెలిపారు. మూడు నెలలు భార్యను సరిగా చూసుకున్న భర్త సుమన్ తన తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. బాధితురాలు జ్యోతి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.

నంది పంప్‌హౌస్ నుంచి

గోదావరి జలాల ఎత్తిపోతలు



డెలివరీ సిస్టర్న్ ద్వారా ఎత్తిపోస్తున్న గోదావరి నీరు

ధర్మారం, ఫిబ్రవరి 2: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం లోగల కాళేశ్వరం ప్రాజెక్ట్ నంది పంప్ హౌస్ నుంచి శుక్రవారం సాయంత్రం గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి అండర్ టన్నెల్ ద్వారా నంది పంప్ హౌస్‌లోకి నీటిని విడుదల చేశారు. అక్కడినుంచి రెండో పంపు మోటార్ ద్వారా 3150 క్యూసెక్కుల నీటిని డెలివరీ సిస్టర్న్ గుండా నంది రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. నంది రిజర్వాయర్‌లో నీటి లభ్యత లేదని రిజర్వాయర్ కింద పంటలు సాగు చేసిన ధర్మారం, వెల్గటూర్ మండలాల రైతులు అధికారులకు విన్నవించారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం నంది పంప్‌హౌస్ ద్వారా రిజర్వాయర్‌లోకి నీటి తరలింపు ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

దళితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న నాగంపేట దళితులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 2: తమ భూమి తమకే ఇవ్వాలని నాగంపేటకు చెందిన దళితులు గంభీరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. 1980-96లో రెండు విడతలుగా అప్పటి ప్రభుత్వాలు సర్వే నంబరు 92/ఏలో ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించి పట్టాలను ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి ఆ స్థలాల్లో తాత్కాలిక గుడిసెలు వేసుకున్నామని, ఇటీవల ఇళ్లు నిర్మించుకునేందుకు తాము సిద్ధమవుతుంటే అదే గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇదేమిటని అడిగితే వేసుకున్న గుడిసెలను తొలగించి, అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. భూమిని తమకే ఇచ్చే విధంగా చూడాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాగంపేటకు చెందిన బాలనర్సు, దేవేంద్ర, దేవరాజు, రాజు, రవి, శంకర్‌బాబు, శేఖర్, రాజవ్వ, లక్ష్మి, లత. లాస్య చంద్రవ్వ ఉన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 2:మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. వీర్నపల్లికి చెందిన కుటుంబ సభ్యులు ఆటోలో శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు.

అటవీశాఖ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై అడవి పంది అడ్డుగా రావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న అబ్రహం, ప్రభలత, పుష్ప, సత్తవ్వ, నవనీత, మంజులకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న స్థానిక ఎస్‌ఐ రమేష్ ప్రమాదాన్ని గమనించి గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షత గాత్రులను ఆసుపత్రికి తరలించిన ఎస్‌ఐని స్థానికులు అభినందించారు.

ఎలుగుబంటి సంచారం

చందుర్తి, ఫిబ్రవరి 2: మండలంలోని ఎనగల్‌లో ఎలుగుబంటి ప్రజల ను బెంబేలెత్తిస్తోంది. శివాలయం నుంచి మామిడిపల్లి గ్రామం వైపు వెళ్లే దారిలో కొత్తచెరువు, నక్క ఒర్రె ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఎలుగు బంటి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఓ రైతు చేనులో పత్తి కర్రను నరికి వేస్తుండగా ఎలుగు బంటి వచ్చింది. భయాందోళనకు గురైన రైతు పరుగెత్తి ఇంటికి చేరుకున్నాడు. ఏ వైపు నుంచి వచ్చి ఎలుగుబంటి దాడి చేస్తుందోనని రైతులు, ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించాలని, ఎలుగుబంటి నిబంధించాలని కోరుకుంటున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2:మండలంలోని పదిరలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటింటా జ్వరంతో మంచం పట్టారు. మండల కేంద్రంతోపాటు సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాల్లో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్తోమత లేని పేదలు ఇంటికే పరిమితమయ్యారు. గ్రామంలో పారిశుధ్యం లోపించి దోమలు తీవ్రమయ్యాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వైద్య అధికారులు వచ్చినా నామమాత్రపు పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించిగ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 2 : గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మదినమైన ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని, జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఆల్ ఇండియా బంజార సేవ సంఘం అధ్యక్షుడు, సేవాలాల్ సోషల్ సర్వీస్ జిల్లా కన్వీనర్ అజ్మీరా భాస్కర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రంలో 13 శాతం ఉన్న గిరిజనులకు స్థలం కేటాయించాలని, సేవాలాల్ మహారాజ్ భవనాన్ని కట్టించాలని అన్నారు. గత ప్రభుత్వంలో కేవలం హైదరాబాద్‌లో బంజార భవన్ నిర్మించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రంలో బంజార భవనాన్ని కట్టించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయస్థాయి పోటీలకు కరీంనగర్ మాస్టర్ అథ్లెట్స్



జాతీయ స్థాయికి ఎంపికైన మాస్టర్ అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 8 నుంచి 11 వరకు జరిగే జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు మాస్టర్ అథ్లెట్స్ ఎంపికయ్యారు. డిసెంబరు 30,31 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేష్ అధ్యక్ష, కార్యదర్శులు పేర్యాల రవీందర్, నీలం లక్ష్మణ్ తెలిపారు. 30 సంవత్స రాల పైబడిన విభాగంలో ఎల్ సత్య, పి ర్యూన్సీ ఎల్ మానసిక, 35 సం వత్స రాలు పైబడిన వారి విభాగంలో టి రజిత, ఎస్ శ్రీధర్, జి వెంకటే ష్, జి స్వామి, సాయిరాం, 40 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఎం రేణుక, కె శోభరాణి, ఎస్ కమల్‌సాగర్, ఎం సంపత్, 45 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఎస్ పద్మ, పి రవళి, పి అమరేందర్, ఎ ప్రభాకర్, బి మల్ల య్య, పి చంద్రశేఖర్, ఎ అశోక్, 50 సంవత్సరాలు పైబడిన విభా గంలో సిహెచ్ మునిందర్, 65 పైబడిన విభాగంలో ఎండి షఫి, 80 పై బడిన విభాగంలో ఎస్ వెంకటయ్య ఎంపికయ్యారని వారు తెలిపారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 87 మంది రైతులు 938క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని,ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, తిరిగి సోమవారం యార్డులో క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.




క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 2: దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామి వారి ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందుగా రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా కొద్ది వారాలుగా భారీ సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేలాది మంది భక్తులు వేములవాడకు చేరుకున్నారు. ఆలయ కల్యాణ కట్ట లో తలనీలాలు సమర్పించి ధర్మ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సర్వ దర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని స్వామి వారిని దర్శించుకొని తరించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.

శుక్రవారం సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపి వేసి లఘు దర్శనం అమలు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా కోడె మొక్కు చెల్లింపు కోసం గంటల కొద్దీ సమయం పట్టింది. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తులు అమ్మ వారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అలరించిన శాస్త్రీయ సంగీతం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవ స్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామివారి ఆరాధన ఉత్సవాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. నాలుగో రోజు శుక్రవారం ఉదయం బాలం భారతి భాగవ తారిణి, సురేఖ భాగవతారిణి హరికథ గానం చేశారు. మధ్యాహ్నం సీహెచ్ రఘు నందన్ సంగీత కచేరి నిర్వహించారు.

సాయంత్రం జయప్రద రామ్మూర్తి వేణువు సోలో కచేరితో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం ఉన్నికృష్ణన్ శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. రాత్రి శాంకరి నృత్య బృందానికి చెందిన వై.విజయ వల్లి నృత్య ప్రదర్శన నిర్వహించారు. చివరగా కె.రాజా బృందం భక్త ప్రహ్లాద పౌరాణిక నాటక ప్రదర్శనతో ఆకట్టుకుంది.




యువతుల సాంస్కృతిక ప్రదర్శన, ఉన్నికృష్ణన్‌ను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

లక్ష్మీ నరసింహుని సన్నిధిలో మంత్రి దామోదర రాజనర్సింహ పూజలు




ధర్మపురిలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, కుటుంబ సభ్యులు, ఆలయం పక్షాన మంత్రికి ఆశీర్వచనం, శేష వస్త్ర, ప్రసాదాలు అందజేత

ధర్మపురి, ఫిబ్రవరి 2: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సమేతంగా శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, స్థానిక వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వారిని ఘనంగా ఆశీర్వదించారు.

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి సత్కరించారు. యాగశాల వద్ద నిర్వహించిన నరసింహ హోమంలో మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారి నిత్య కల్యాణంలో మంత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందించి ఆలయం పక్షాన స్వామి శేషవస్త్ర, ప్రసాదాలు అందించి సత్కరించారు.

నరసింహుని దర్శనం ఆనందంగా ఉంది

లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం ఆనందంగా ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. స్వామి దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో ఆయన కొద్ది సేపు విలేకరులతో మాట్లాడారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తన ఇళ వేల్పు అన్నారు. స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానం కోసం ఆయన రూ 1,00,000 విరాళాలు అందించారు. అలాగే బ్రాహ్మణ సంఘం అభివృద్ధి కోసం ఆయన రూ 1,01,000 విరాళాలు అందించారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నిర్వీర్యం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రాష్ట్రంలో తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాం క్షలు నిర్వీర్యమయ్యాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్ఎస్ పాలనలో ఏళ్ల తరబడి అనేక ఇబ్బందులు పడ్డ ప్రజలు ఆ పాలన నుంచి విముక్తి కోసమే కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే ఒక్కొక్క గ్యారెంటీ పథకాన్ని అమలు చేసి ప్రజాసంక్షేమ పాలన అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది నియామకాల ప్రక్రియ అనేది అర్హులైన స్థానికులతో భర్తీ చేయడం కోసం జిల్లా యంత్రాగానికి అప్పగించే దిశగా ఆలోచిస్తున్నామన్నారు. పలు జిల్లాల్లోని 22 నియోజకవర్గాలు కోల్ బెల్ట్ పరిధిలో ఉండగా పరిశ్రమలు మాత్రం లేవన్నారు.

సింగరేణి సీనరేజి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించడం కోసం వెళితే పోలీసులను పెట్టి అడ్డుకున్నారన్నారు. తాము ఎవరిని విమర్శించడం లేదని, కేవలం ఆత్మ విమర్శ చేసుకోవాలని అంటున్నామని ఆయన తెలిపారు. ధర్మపురికి వైద్య పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ విషయంలో అడ్వకేట్ జనరల్, న్యాయవాదులు సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

10న 'నవోదయ' ప్రవేశ పరీక్ష

చొప్పదండి, ఫిబ్రవరి 2: నవోదయ విద్యాలయం లో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మంగ తాయారు ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం 1,745, 11వ తరగతిలో ప్రవేశాలకు 1,144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నార న్నారు. వీరి కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్‌లను ఆన్ లైన్‌లో ఉంచామని, డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గురుకుల సీవోఈ ఇంటర్ ప్రవేశ పరీక్ష రేపు

మానకొండూర్, జనవరి 2: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల సీవోఈ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 4న నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల డీసీవో శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలనికోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

ధర్మారం, ఫిబ్రవరి 2: ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామానికి చెందిన భూతగడ్డల వసంత (29) అనే వివాహిత గురువారం సాయంత్రం కడుపునొప్పి బాధ భరించలేక పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మూడేళ్ల నుంచి ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం తీవ్రంగా కడుపునొప్పి రావడంతో బాధ భరించలేక సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలుకు వైశాలి (10), గునజ(6)కు మార్తెలున్నారు. శుక్రవారం మృతురాలి సోదరుడు నూనె మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ ముగ్గురికి గాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 2: మండలంలోని పోచంపల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని మంకమ్మతోటకుచెందిన ఎదులాపురం జగన్(58), మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పొట్టాల లక్ష్మయ్య(50), పని నిమిత్తం పోచంపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నారు. పచ్చునూర్‌కు చెందిన ఎరవెల్లి కుమార్(40) కరీంనగర్ నుంచి పచ్చునూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 2: కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతంలో గత నెల 30న మంటలు అంటుకుని కాలిన గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎండీ ఖాసీం(55) శుక్రవారం మృతి చెందాడని రెండో ఠాణా సీఐ ఓ వెంకటేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఖాసీం జనవరి 30న ఇంటి వద్ద ఉన్న సమయంలో అతని బట్టలపై శానిటైజర్ బాటిల్ పడింది. కొద్దిసేపటి తరువాత ఖాసీం బయటకు వచ్చి బీడీ తాగేందుకు అగ్గిపుల్లను వెలిగించగానే అతనికి ఒంటిపైన బట్టలకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పివేసి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కొడుకు మహ్మద్ ఫహద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా ఖాసీం కొడుకుపై స్థానిక నాయకులు అక్రమ కేసు పెట్టించి జైలుకు పంపించటంతో మనస్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నది.

రైలు కింద పడి వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 2: జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి శుక్రవారం అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. ఓడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా భారుపాలి గ్రామానికి చెం దిన గోపాల్ ఛాత్రీయా (43) తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఎక్కి జనరల్ కోచ్‌లో సికింద్రాబాద్‌కు వస్తున్నాడు. మార్గ మధ్యలో బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య ద్రౌపతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సాగర్

ముస్తాబాద్, ఫిబ్రవరి 2: మండలంలోని మోర్రాయిపల్లె గ్రామానికి చెందిన గూడ సాగర్ (18) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాగర్ ఇంటర్ పూర్తి చేసి ఢిల్లీలో కంప్యూటర్‌పై శిక్షణ తీసుకొని వచ్చాడు. తిరిగి ఢిల్లీ వెళ్లే క్రమంలో ఉద్యోగం వస్తాదో? రాదో?నని మనస్తాపం చెందాడు. గ్రామానికి సమీపంలోని కోళ్ల ఫారంలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లాత్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

కొడిమ్యాల, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని శ్రీ సుమంగళి క్లాత్ స్టోర్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు బుర్ర సంతోష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో దుకాణంలో ఉన్న పట్టు చీరెలతో పాటు ఫర్నిచర్ కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ప్రమాదం ఎలా జరిగింది అనేది తెలియటం లేదు. సంఘటన స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వి. రవీందర్ పరిశీలించారు.



ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 2: ఆరోగ్య సమస్యలపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆసుపత్రి మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల, చంద్రంపేట ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జిల్లా మానసిక ఆరోగ్యం ప్రోగ్రాంలో భాగంగా 8, 9, 10 తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక, శారీరక సమస్యలు ఎదురైతే పరిష్కారం కోసం హెల్ప్‌లైన్ నంబరు 14416 వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కనకయ్య పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోనరావుపేట, ఫిబ్రవరి 2 : తెలంగాణ టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ వైద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నూగురి దేవేందర్ కోరారు. కోనరావుపేట మండలం కొలనూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తెలంగాణ టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్య, వైజ్ఞానిక మహాసభ పోస్టర్‌ను శుక్రవారం ఎంఈవో దూస రఘుపతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే ఈ మహాసభలను ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు నరేందర్, శ్రీనివాస్, అశోక్, రవీంద్రబాబు, రవీందర్, ఆస్మా బేగం, కమల్, నయన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 2: దేశవ్యాప్త కార్మికుల సమ్మె కరపత్రాన్ని మండలకేంద్రంలో శుక్రవారం రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంద సుదర్శన్, గన్నారం నర్సయ్య, సావనపెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలి

ముస్తాబాద్, ఫిబ్రవరి 2: పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో బండి సంజ్‌ని గెలిపించాలని ముస్తబాద్ మండల భారతీయ జనత పార్టీ అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెర్గు అంజాగౌడ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేపట్టే కార్యాచరణపై వివరించారు. బండి సంజయ్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపిం చాలన్నారు. కార్యకర్తలంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. బీజేపీ ద్వారానే దేశాభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శి సొల్ల క్రాంతి, పీఏసీఎస్ డైరెక్టర్ గిరిధర్‌రెడ్డి, ఏదునూరి గోపి, తిరుపతి, రమేశ్, అధ్యక్షులు కుడుకుల జనార్దన్, వరి వెంకటేశ్, కామిటికారి పద్మ, శంకర్, ప్రభాకర్‌రెడ్డి, కళ్యాణ్, మీస స్వామి దీటి సత్తయ్య, శక్తి ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొన్నంపై విమర్శలు సరికాదు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 2: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించడం బీఆర్ఎస్ నాయకుల చేతకానితనానికి నిదర్శనమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంలో పొన్నం ప్రభాకర్ కార్యకర్తలతో చనువుగా ప్రవర్తిస్తే బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పుర్మాని లింగారెడ్డి, నేరెళ్ల నర్సింగం, గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, మహేందర్ ఉన్నారు.

'బెదిరింపులకు గురి చేస్తున్న డీఎం'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2: విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను పెంచాలని సిరిసిల్ల డిపో మేనేజర్‌ను కోరితే కేసులు పెడతామంటూ దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పాతబస్టాండ్ ప్రయాణ ప్రాంగణం వద్ద రవిగౌడ్ మాట్లాడారు. సాయంత్రం సిరిసిల్ల పాతబస్టాండ్‌లో ఎక్కువ మంది విద్యార్థులు బస్సు ఎక్కడంతో కొంత మందిని దింపి వేశారని, విద్యార్థుల నిరసన వ్యక్తం చేశారని అన్నారు. బస్టాండ్‌కు వచ్చిన డిపో మేనేజర్ విద్యార్థులతో దురుసుగా వ్యవహరించారన్నారు. ధర్నాలు చేస్తే కేసులు పెడతామంటూ తమను డీఎం బెదిరించారని ఆరోపించారు. డీఎం వ్యవహారంపై కలెక్టర్, టీఎస్ఆర్టీసీ ఎండీ, ఆర్ఎంకీ ఫిర్యాదు చేశామన్నారు. నాయకులు శ్రీనివాస్, జగన్, నవీన్, సందీప్, స్వామి, నరేష్ పాల్గొన్నారు.

దండు సంజయ్ స్మారకార్థం కబడ్డీ పోటీలు

కోనరావుపేట, ఫిబ్రవరి 2 : కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన దండు సంజయ్ జ్ఞాపకార్థం తన తోటి స్నేహితులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను రెండు రోజులు నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి గెలుచుకున్న చెక్కపల్లి క్రీడాకారులకు రూపాయలు 10 వేలు నగదు ట్రోఫీ, ద్వితీయ బహుమతి అనుపురం క్రీడాకారులు గెలుపొందగా 5 వేల రూపాయలు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా మృతి చెందిన తన స్నేహితుని పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి బహుమతులు అందజేశారు.

సామాన్యులకు ప్రయోజనం లేని బడ్జెట్

కోనరావుపేట, ఫిబ్రవరి 2 : సామాన్య మానవులకు ప్రయోజనం లేని విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని జై భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దుబ్బుల ప్రవీణ్ ఆరోపించారు. సుద్దాలలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేటర్లకే పనికొచ్చే విధంగా ఉందన్నారు. ఆహార, సామాజిక భద్రతలో కోతలు విధించారన్నారు. ఆదాయం పెరిగితే కేటాయింపు ఎందుకు పెంచలేదన్నారు. కార్యక్రమంలో జై భీమ్ నాయకులు మాసం బాబు, రంజిత్, నిఖిల్, ప్రశాంత్, రాజు, సుమన్, కార్తీక్, జీవన్, వంశీ ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామ తాజా, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ గుండెపోటుతో శస్త్ర చికిత్స పొందిన ఆయనను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు కృష్ణహరి, రాజారాం తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 2 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం దుంద్రపల్లికి చెందిన కందుల భూంరెడ్డి (57) వేములవాడకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. శాత్రాజుపల్లి వద్ద రోడ్‌పై నిలచి ఉన్న ఎక్స్‌కావేటర్‌ను ఢీకొని కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 2: తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు వైద్యులు సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం అత్యాధునిక వైద్య విధానాలు అమల్లోకి వచ్చినందన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మానవత్వంతో, సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధ చూపెట్టలేక పోయిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీ పథకం పరిధిని 10 లక్షల రూపాయలకు పెంచామని తెలిపారు. డాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చూసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడే వారికి సకాలంలో వైద్యం అందించేందుకు 50 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మానకొండూర్ ధర్మపురి ఎమ్మెల్యేలు కవంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పురుమళ్ల శ్రీనివాస్, డాక్టర్ మోతిలాల్ బంగారు స్వామి, వీరారెడ్డి, తిమ్మారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 2: ప్రజలు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసెస్‌లో భాగంగా జిల్లాలోని ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, మనమీద కుటుంబసభ్యులు ఆధారపడి ఉంటారన్నారు. మద్యం తాగి నిర్లక్ష్యంగా ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు. రహదారులు ప్రాచీన నాగరికతకు చిహ్నమని, రహదారులు పచ్చని నీడనిచ్చే చెట్లతో కళకళలాడేలా తప్ప రక్తపు మరకలతో తడిసి పోవద్దన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులు, వాహన దారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్సై రాజు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ కిశోర్‌చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ హైస్కూల్‌లో రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలను నడుపాలన్నారు. సీటు బెల్ట్, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ నెమ్మదిగా వెళ్లాలన్నారు. అతి వేగం ప్రమాదకరమన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లి ప్రాణాలను పోగొట్టుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ రిస్విజార్డ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని ఎస్సై రమేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రత నియమాలు, ప్రమాదాలు అనే అంశాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. హెవీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం, కానిస్టేబుల్ మెయిన్ పాషా, కార్తీక్ ఉన్నారు.

ముస్తాబాద్: రహదారి నాగరికతకు చిహ్నమని ప్రయాణం ప్రగతికి సంకేతమని ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రహదారి భద్రతా



మాట్లాడుతున్న ఎంవీఐ కిశోర్ చంద్రశేఖర్‌రెడ్డి



రోడ్డు భద్రత నియమాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై రమేష్

శుక్రవారం విద్యార్థులతో ప్రతిజ్ఞను చేయించారు. ఈ సదర్భంగా ఎస్సై శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపొద్దని, మద్యం తాగి నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేయవద్దన్నారు. ఫోన్‌లో మాట్లాడుతు డ్రైవింగ్ చెయొద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ కళాశాల ఆవరణలో 35వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతాపై శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతకు సంబంధించి పోలీస్‌లు అవగాహన కల్పించారు. విధిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ విల్లర్ వాహనదారుడు సీట్ బెల్టు దరించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంమోహన్ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాళశాల విద్యార్థులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలు నడిపే సమయంలో రోడ్డు సైడు ఉండే సైన్ బోర్డులు వంటి ట్రాఫిక్ నియమాలను పాటించాలని, ఆతివేగంతో, నిర్లక్ష్యంతో, మద్య తాగి, హెల్మెట్ లేకండా, సెల్‌పోన్ మాట్లాడుతూ వాహనాలను నడపకుడదన్నారు.

ఎన్నికలు నిర్వహించకపోతే కుంటుపడనున్న అభివృద్ధి



మాట్లాడుతున్న నాఫ్స్ కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2: సర్పంచుల ఎన్నికల త్వరగా నిర్వహించక పోతే కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోతాయని, తెలంగాణ గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడారు. సర్పంచుల పాలన ముగిసి నేటి నుంచి అధికారుల పాలన వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమం నడుస్తున్న సమయంలో సర్పంచుల పదవీకాలసమయం ముగిస్తే ఎన్నికలు నిర్వహించకుండా నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యవస్థను రెండు సంవత్సరాలపాటు కుంటుపడేల చేశారని ఆరోపించారు. మళ్లీ అదే పునరావృతం అవుతుందని భయాందోళన నెలకొందన్నారు. కాంగ్రెస్‌లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు ఉన్నారని, వారు ఆలోచన చేయాలని కోరారు. సర్పంచుల ఎన్నికలు నిర్వహించక పోవడంతో కేంద్రం నిధులు నిలిచిపోతాయన్నారు. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలోని గ్రామాల అభివృద్ధిని దేశ, విదేశాల నుంచి వచ్చిన వారు సందర్శించి అభివృద్ధిని చూసి అభినందించారన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలలో తెలంగాణలోని అత్యధిక గ్రామాలు కేంద్రం నుంచి అవార్డులను అందుకున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాను విమర్శించడం లేదని, ప్రత్యేక అధికారులపాలనతో గ్రామాలను తీసుకొస్తే అభివృద్ధి వెనకబడుతుందని అన్నారు. నర్మాల ప్రాజెక్ట్‌కు కింద ఉన్న వ్యవసాయ భూములకు సాగునీరు ఇచ్చే విధంగా ప్రభుత్వం, అధికారులు ఆలోచన చేయాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదన్నారు. వ్యవసాయం తరువాత అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమ దేశ వ్యాప్తంగా ఆటుపోటులను ఎదుర్కొంటోందన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర బడ్జెట్ కార్మికులు, యజమానులను నిరాశపరిచిందన్నారు. పది సంవత్సరాల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగాపవర్‌లూం క్లస్టర్‌ను ఎంపీ తీసుకొస్తారని అనుకున్నామన్నారు. సిరిసిల్ల కార్మికులకు 365 రోజులు పనికల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా, పట్టణ అధ్యక్షుడు తోట ఆగయ్య, జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కౌన్సిలర్లు దార్నం అరుణ, వేముల రవి, నాయకులు అడగట్ల మురళి, దిడి రాజు, దార్ల సందీప్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ సమయంలో పోరాడినవారికి గుర్తింపు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 2: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎమర్జెన్సీ సమయంలో అప్పటి ప్రభుత్వంతో పోరాడిన వారికి గుర్తింపు ఉంటుందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. జగిత్యాలలో భారత సురక్షా సమితి జిల్లా శాఖ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంద్రసే నారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇంద్రసేనారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఎమర్జెన్సీ పోరాటంలో పాల్గొని ప్రాణత్యాగం చేసిన అమరులకు, వయోభారంతో మృతి చెందిన సభ్యుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకున్నాక, ఎన్నికల హడావిడి నేపథ్యంలో ఎవరినీ కలవ లేకపోయానన్నారు. ఏ పదవిలో ఉన్న తన సహచరులను మర్చి పో కుండా ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఎమర్జెన్సీ పోరాటంలో భాగంగా లాఠిచార్జి అయిన, అరెస్టయిన ముందుండి పోరాడిన అశోక్ కుమార్ దాదా పోరాటం స్ఫూర్తి దాయకం అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక సమర యోధులుగా గుర్తించి గౌరవిం చినట్లు గానే, ఎమర్జెన్సీ పోరాటయోధు లను గుర్తించాలనే తలంపుతో ఆనాటి యోధులు ఉన్నారన్నారు. ఇప్పటికే గుర్తింపు కోసం పోరాటం చేసి కొన్ని ప్రాంతాల్లో గుర్తింపు సాధించామని, ఇందులో భాగంగానే మన రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇలాంటి గుర్తింపు కోసం అశోక్ కుమార్ నాయకత్వంలో ఈ భారత సురక్ష సమితి ఆవిర్భవించిందన్నారు. 1962లో ఆర్ఎస్ఎస్‌లో ఆరంగ్రేటం నుంచి నేటి గవర్నర్ వరకు అనేక పదవులు, హోదాలు అనుభవించా నని, వివిధ హోదాల్లో పని చేసిన తనను గుర్తించి గవర్నర్‌గా నియ మించిన ప్రధాని నరేంద్రమోదీకి ఇంద్ర సేనా రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గవ ర్నర్ అంటే హోదా కాదని బాధ్యత అన్నారు. త్రిపురలాంటి రాష్ట్రం అక్షరాస్యతలో ముందున్నా కొన్ని సాంఘిక దురాచారాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా చైల్డ్ మ్యారేజ్‌లు త్రిపురలో ఎక్కువగా జరుగుతున్నాయని, దీని నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. అనంతరం పట్టణానికి చెందిన పలు కులసంఘాల నాయకులు, జర్నలిస్టులు, పుర ప్రముఖులు గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారత సురక్షా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అశోక్ కుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, భూపతి రెడ్డి, కృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కాసిపేట లింగయ్య, గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీంధర్‌రెడ్డి, సింగం గంగాధర్, కాశీనాథం, సత్యప్ర కాష్, అర్జున్‌రావు, సంపూర్ణచారి, పోచమల్లు, అరు ణ్‌కుమార్, బిట్టు తదితరులున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 11: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, రెండు పేస్కేల్స్, బాండు డబ్బులు ఇప్పించాలని ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వైస్ చైర్మెన్, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ జక్కుల మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో కరీంనగర్ 2 డిపో కార్మికులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులపై మోపుతున్న పనిభారాన్ని తగ్గించాలని, ఓటీ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేల్ఫేర్ కమిటీలను రద్దు చేసి, యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రీజినల్ అధ్యక్షుడు ఎస్‌కే రాజు, ఎస్ఎం చారి, బీఆర్ రావు, సయ్యద్ జాని, రమేశ్, ఇసాక్, కాసర్ల ప్రభాకర్, సునీత పాల్గొన్నారు.

అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్, వైస్ చైర్మన్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2: సిరిసిల్ల పురపాలక సంఘంలో అవినీతి జరిగిందని నిరాధారణ ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమా? అని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి సవాల్ విసిరారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో చైర్ పర్సన్ చాంబర్‌లో విలేకరుల సమావేశంలో సిరిసిల్ల పురపాలక సంఘం చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ మాట్లాడారు. పురపాలక సంఘం పాలకవర్గంపై పనిగట్టుకొని కాంగ్రెస్ నాయకులు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇందులో భాగంగా నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో పాలకవర్గం సభ్యురాలిగా ప్రజలకు సేవలందించిన వారు పురపాలక సంఘం సేవలపై అవగాహన లేకుండా మాట్లాడడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల అభివృద్ధి కోసం రూ. 40 కోట్లు నిధులను మంజూరు చేయించారన్నారు. ఇందులో భాగంగా స్థానిక కొత్త చెరువు కాలవ నిర్మాణం కోసం రూ.15 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. విలీన గ్రామాలు సిరిసిల్ల పట్టణాన్ని కలుపుతూ లింక్ రోడ్లను ఏర్పాటుకు, వివిధ జంక్షన్‌ల అభివృద్ధితోపాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉద్దేశంతో 2023 జూలై 18న రూ.40 కోట్లు నిధులను సిరిసిల్ల పురపాలక సంఘానికి కేటీఆర్ సహకారంతో నాడు ప్రభుత్వం జీవోను విడదల చేసిందన్నారు. జూలై 25న సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి ప్రభుత్వ జీవో కాపీ వచ్చిందని, అశ్రద్ధ చేయకుండా నిధులు దుర్వినియోగం కాకుండా 39 మంది కౌన్సిలర్లు, అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు చేయాల్సిన అత్యవసరమైన 254 పనులను గుర్తించామని, కలెక్టర్ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపించగా 2023 ఆగస్టు 5న ఆమోదించినట్లు చెప్పారు. టెండర్ ప్రక్రియ కొనసాగించడం కోసం తెలంగాణ రాష్ట్ర సాంకేతిక అనుమతులకు హైదరాబాద్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు (ఈఎన్‌సీ)పంపించామన్నారు. ఆగస్టు 25 నాటికి అధికారుల నుంచి సాంకేతిక అనుమతులు రావడంతో అలసత్వం వహించకుండా రూ.40 కోట్లకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేశామని, అభివద్ధి పనులు ప్రారంభించే లోపే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఇందులో పురపాలక సంఘం పాలకవర్గం ఎక్కడ అలసత్వం వహించిందన్నారు. టెండర్ ప్రక్రియనేది ఉంటుందని కాంగ్రెస్ నాయకులు మర్చిపోయారని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 40 కోట్లు కేటాయిస్తే ఎన్నికల అనంతరం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను తాత్కాలికంగా నిలిపివేయడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల పురపాలక సంఘం అభివృద్ధి కోసం కేటాయించిన రూ. 40 లక్షలను నిలిపివేసి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండు కోట్లు కేటాయించడం ఎంత వరకు సమంజసమన్నారు. విలీన గ్రామాలతో సిరిసిల్ల పట్టణ విస్తీర్ణం పెరగడంతో ప్రజలకు మెరుగైన సేవలను అందించడం కోసం పారిశుధ్య కార్మికులను ఎక్కువగా తీసుకున్నట్లు చెప్పారు. పురపాలకకు నెలకు ఆదాయం రూ.87 లక్షల వరకు ఉంటే ఖర్చు కోటి 30 లక్షల వరకు ఉందన్నారు. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉండడంతో ఆదాయ వనరులు సృష్టించుకుంటూ సిరిసిల్ల పురపాలక సంఘం అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు కృషి చేస్తుంటే అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పురపాలక సంఘం జనరల్ ఫండ్‌లో లోటు ఉన్నమాట వాస్తవైననంత మాత్రానా మున్సిపల్‌లో అవినీతి జరుగుతోందని నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులపై కాంగ్రెస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు నమ్మె పరిస్థితుల్లో లేరన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు దార్నం అరుణ, ఆడెపు సౌజన్య, భూక్య రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, కో అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో ఆత్మీయ సన్మానాలు



సన్మానం పొందిన పాలకవర్గం



మానాలలో పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు



చందుర్తిలో..

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: పంచాయతీ పాలక వర్గాల పదవి కాలం ముగియడంతో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, తిమ్మాపూర్, రాగట్లపల్లి తదితర గ్రామాల్లో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను స్థానికులు శుక్రవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఐదేళ్ల గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. పదవులు లేకున్నా ప్రజలకు సేవ చేయాలని కోరారు.

చందుర్తి : చందుర్తి గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని శుక్రవారం గ్రామస్థులు సన్మానించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఐదు సంవత్సరాలపాటు సేవలందించిన సర్పంచ్ సిరికొండ ప్రేమలత శ్రీనివాస్, ఉప సర్పంచ్ చిర్రం తిరుపతి, కార్యదర్శి శ్రీనివాస్‌తోపాటు వార్డు సభ్యులను, గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాలపాటు గ్రామ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కిరణ్ కుమార్, ఎంపీడీవో రవీందర్, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, ఏపీఎం రజిత, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, మండల కో ఆప్షన్ సభ్యుడు కమలాకర్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: గ్రామపంచాయతీ పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో రుద్రంగి మండలం మానాలలోని సర్పంచ్ ఆల్లూరి మానస, పాలకవర్గాన్ని శుక్రవారం వీడీసీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో వీడుకోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, నాయకులు జక్కు, మోహన్, వంశీ, రవీందర్ పాల్గొన్నారు.

● రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్‌ను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు తమ్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.